క్లుప్తంగా

వైకుంఠధామానికి మరమ్మతులు



వైకుంఠధామానికి మరమ్మతు చేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

అక్కన్నపేట(హుస్నాబాద్): జూలై 22వ తేదీన 'నాణ్యత డొల్ల...ధామం ఇలా! పట్టించుకోని అధికారులు అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనంపై పంచాయతీరాజ్ అధికారులు స్పందించారు. బుధవారం పంచాయతీరాజ్ ఏఈ స్నేహ మాట్లాడుతూ పెద్దతండా గ్రామ వైకుంఠధామానికి మరమ్మతులు చేయించామన్నారు. నాణ్యతలో రాజీపడే ప్రశక్తిలేదన్నారు. గ్రామ శివారు చెరువుకు దగ్గరలో ఉండటంతో కొంత ఇబ్బందులు వచ్చాయన్నారు.

4న కలెక్టర్ కార్యాలయం ముట్టడి

చేర్యాల(సిద్దిపేట): రెవెన్యూ డివిజన్ సాధనకు ఈనెల 4వ తేదీన చేర్యాల రెవెన్యూ డివిజన సాధన జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన కలెక్టరేట్ ముట్టడికి చేపట్టిన మోటార్ సైకిల్ యాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వకులాభరణం నర్సయ్య పంతులు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ డివిజన్ సాధనకు చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యాక్రమానికి హాజరయ్యే కార్యకర్తలు చేర్యాలలోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు వచ్చి మోటార్ సైకిల్ యాత్రగా బయలుదేరి వెళ్లాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు బుడిగె గురువయ్యగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగమల్ల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్లుగా బాధ్యతల స్వీకరణ

రాయపోలు(దుబ్బాక): రాయపోలు మండల నూతన తహసీల్దార్‌గా జహీర్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ ఉమారాణి ఎన్నికల బదిలీలలో భాగంగా ఇతర జిల్లాకు బదిలీపై వెళ్లారు. జహీర్‌కు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పూర్తి బాధ్యతలను అప్పగిస్తూ బుధవారం కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఉత్తర్వులు జారీ చేశారు.

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు మండల తహసీల్దార్ భూపతి బదిలీపై సిరిసిల్ల జిల్లాకు వెళ్లారు. ఆయన స్థానంలో దూల్మిట్ట మండల తహసీల్దార్ గోపాల్ మద్దూరు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

నష్టపరిహారం అందించాలని వినతి

చేర్యాల(సిద్దిపేట): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన వారికి వెంటనే నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, కౌన్సిలర్లు చెవిటి లింగం, సందుల సురేశ్, పట్టణ అధ్యక్షుడు మంచాల చిరంజీవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అప్పుడు పాకలు వేసుకోవచ్చని కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ పేదలకు భరోసా ఇచ్చారు. మండలంలోని బేగంపేటలో ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లకు కేటాయించిన స్థలంలో పలువురు పేదలు వేసుకున్న గుడిసెలను బుధవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. గత ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఇల్లు నిర్మించలేదని విమర్శించారు. ఇళ్ల నిర్మాణం చేపట్టనందుకు నైతిక బాధ్యత వహిస్తూ ఎమ్మెల్యే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దామోదర్ తదితరులు ఉన్నారు.

కమిషనర్‌కు వీడ్కోలు

హుస్నాబాద్: హుస్నాబాద్ పురపాలక సంఘం బదిలీపై వెళ్లిన మాజీ కమిషనర్ రాజమల్లయ్యకు బుధవారం పురపాలక సంఘం ఆధ్వర్యంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు, అధికారులు ఆయనను ఘనంగా సత్కారించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

గజ్వేల్‌రూరల్: కుర్ర సత్యనారాయణను ఎమ్మెల్సీగా ప్రకటించడంపై ఎరుకుల సంఘం నాయకులు హర్షం ప్రకటించారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కూరాకుల శ్రీనివాస్, ఆత్మ కమిటీ డైరెక్టర్ కూరాకుల సాయి, సోషల్‌మీడియా ప్రెసిడెంట్ శివ, ఎస్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు వెంకటసాయి, మండల అధ్యక్షుడు గాలయ్య పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధం

- గ్రామాల్లో ఆరోగ్య ఉపకేంద్రాల ఏర్పాటు
- భవన నిర్మాణాలకు నిధుల కేటాయింపు
- తుది దశకు చేరుకున్న పనులు



పూర్తయిన గండిపల్లి గ్రామ ఆరోగ్య ఉప కేంద్రం భవనం

అక్కన్నపేట(హుస్నాబాద్): 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు' ఇది పాత పాట..ఇప్పుడు తెలంగాణలో ఈ పాటను మార్చి పాడుకుంటున్నారు. నేను వస్త బిడ్డో సర్కారు దవాఖానకు అంటూ ప్రజలు పాడుతున్నారు. గ్రామీణ ప్రజలకు వైద్యసేవలను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు నిదర్శనమే అక్కన్నపేట మండలంలో ఏర్పాటుచేసిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు. అవి ప్రారంభోత్సవాలకు ముస్తాబవుతున్నాయి. అక్కన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కట్కూర్, మల్లంపల్లి, జనగామ, రామవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గండిపల్లి, గౌరవెల్లి, రేగొండ ఆరోగ్య ఉప కేంద్రాలుగా ఉన్నాయి. గండిపల్లి, జనగామ, రేగొండ గ్రామాల్లోని ఆరోగ్య ఉపకేంద్రాల భవనాలు నిర్మాణానికి 2021లో ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ శంకుస్థాపను చేశారు. గండిపల్లి ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణానికి రూ.22 లక్షలు, జనగామకు రూ.22 లక్షలు, రేగొండకు రూ.20 లక్షలు కేటాయించారు. జనగామ, గండిపల్లి గ్రామాల ఆరోగ్య ఉప కేంద్రాల భవన నిర్మాణాలు తుదిదశకు చేరుకున్నాయి.

త్వరలో ప్రారంభిస్తాం



జనగామ, గండిపల్లి గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. రంగులు వేసే పనులు మిగిలాయి. త్వరగా పూర్తి చేయిస్తాం. కేంద్రాలను అందుబాటులోకి తెస్తాం.

– స్నేహ, పంచాయతీరాజ్ ఏఈ

చెత్తరహిత పట్టణంగా సిద్దిపేట



చెత్తపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు

సిద్దిపేట కమాన్: చెత్త రహిత పట్టణంగా చేయడమే మంత్రి హరీశ్‌రావు లక్ష్యమని సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ కడవెర్గు రాజనర్సు అన్నారు. నడుస్తూ చెత్తను తొలగిద్దాం కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట మున్సిపాలిటీ పరిధి 1వ వార్డు లింగారెడ్డిపల్లిలో బుధవారం మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, కౌన్సిలర్లతో కలిసి రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో ఉన్న చెత్తను తొలగించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ విజేందర్‌రెడ్డి, కౌన్సెలర్లు, మున్సిపల్ అధికారులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలను పెంచేందుకు కృషి చేయండి

చేర్యాల(సిద్దిపేట): విద్యా ప్రమాణాలుపెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంఈఓ మొగుళ్ల నర్సింహారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ముస్త్యాల మోడల్ స్కూల్‌లో నిర్వహించిన ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో మాట్లాడారు. విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ రచ్చ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

కండ్ల కలకపై ఆందోళన వద్దు

కోహెడరూరల్(హుస్నాబాద్): కండ్ల కలకపై ఆందోళన వద్దని, ఈ వ్యాధిని అవగాహనతోనే దూరం చేయొచ్చని కంటి వెలుగు టీం జిల్లా అధికారి శ్రీనాథ్ అన్నారు. బుధవారం మండలంలోని శనిగరం గ్రామంలో విద్యార్థుల వసతి గృహాన్ని సందర్శించి అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే కండ్ల కలక రాదన్నారు. కార్యక్రమంలో కంటి వెలుగు అధికారులు శ్రీనివాస్, భద్రయ్య, డాక్టర్ రిమిషా, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చేపట్టాలి



పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ రాధిక

కొమురవెల్లి(సిద్దిపేట): అధిక వర్షాల కారణంగా ప్రత్తి పంట పాడవకుండా రైతులు సస్యరక్షణ చేపట్టాలని ఏడీఏ తక్కోలు రాధిక సూచించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు కిష్టంపేట గ్రామాల్లో ప్రత్తి పొలాలను సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అధిక వర్షాల కారణంగా పత్తి పంటలో నిలిచిన నీటిని త్వరగా బయటకు పోయేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ మొక్కకు 5 నుంచి 7 సెంటీ మీటర్ల దూరంలో వేయాలని సూచించారు. నల్లరేగడి నేలల్లో అంతర సేద్యం వీలుకాకపోతే 20 నుంచి 25 రోజుల దశలో క్విజ్లోపాప్ఇథైల్, 400 మి.లీ. పైరీ తయోబాకు సోడియం 250 మి.లీ. కలిపి పిచికారీ చేయాలన్నారు. అధిక తేమ వల్ల పత్తిలో వేరుకుళ్ల తెగులు ఆశించే అవకాశం ఉంటుందని, నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బెండజిం ఒక గ్రామం లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.

సాగు పంటల వివరాల నమోదు తప్పనిసరి



ధర్మారంలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ మల్లేశం

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రభుత్వం పంటలు కొనుగోలు చేయాలంటే రైతులు సాగుచేసిన పంటల వివరాలను తప్పని సరిగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేశం సూచించారు. మండల పరిధిలోని ధర్మారంలో రైతులు సాగుచేస్తున్న పత్తి, మొక్కజొన్న పంటలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము సాగుచేస్తున్న పంటల వివరాలను నమోదు చేయించకపోతే పంటల విక్రయ సమయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయన్నారు. ఆయా గ్రామాల్లో అందుబాటులో ఉంటే ఏఈఓల వద్ద పంటల వివరాలను రైతులు విధిగా నమోదు చేయాలని కోరారు. ఆయన వెంట ఏఈఓలు నిర్మల, సాయి తదితరులు ఉన్నారు.

వంతెన నిర్మించాలి



ఆందోళన చేస్తున్న రైతులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామశివారులోని మట్టి రోడ్డుపై వంతెన నిర్మించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం రైతులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కమిటీ సభ్యుడు కత్తుల భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పోతిరెడ్డిపల్లి శివారులోని రోడ్డు వర్షాలకు కోతకు గురవడంతో పడమటికేశవపూర్, నాగిరెడ్డిపల్లి, చుంచనకోట, లింగంపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు.

5లోగా రైతుబీమా చేయించుకోవాలి

వ్యవసాయాధికారి గోవిందరాజులు



శేరిపల్లి బందారంలో రైతుబంధుపై వివరిస్తున్న ఏఓ

రాయపోలు(దుబ్బాక): రైతుబీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని దౌల్తాబాద్ మండల వ్యవసాయాధికారి గోవిందరాజులు సూచించారు. బుధవారం దౌల్తాబాద్ మండలం ముబారస్ పూర్ క్లస్టర్ పరిధిలోని శేరిపల్లి బందారంలో రైతు బీమాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5వ తేదీలోగా నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు బీమా చేయించుకోవాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ వివరాలతో ఏఈఓలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి సునీత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల అందజేత

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని ధర్మారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు రంగనబోయిన యాదగిరి బుధవారం టై బెల్టులు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, నాయకులు బాలరాజు, విష్ణు, భాను, రమేశ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన ఉండాలి

కోహెడరూరల్(హుస్నాబాద్): ఈవీఎంలపై ప్రజలకు అవగాహన ఉండాలని సర్పంచ్ పాము నాగేశ్వరీ శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండలంలోని తంగళ్ళపల్లిలో ఈవీఎంలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎన్నికల్లో కంట్రోల్, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్‌లు ఎలా పనిచేస్తాయో తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొనే శేఖర్, వార్డు సభ్యులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తుడు పింగళి వెంకయ్య

గజ్వేల్‌రూరల్: గొప్ప దేశభక్తుడు పింగళి వెంకయ్య అని రామకోటి భక్తసమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు పేర్కొన్నారు. పింగళి వెంకయ్య 145వ జయంతి సందర్భంగా బుధవారం గజ్వేల్‌లోని రామకోటి కార్యాలయంలో పింగళి వెంకయ్య రూపాన్ని చిత్రించి నివాళులర్పించారు.

వైద్యరంగానికి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



కోహెడలో 108 అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

కోహెడ(హుస్నాబాద్): వైద్యరంగానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. కోహెడకు మంత్రి హరీశ్‌రావు మంజూరు చేసిన 108 అంబులెన్స్ వాహనాన్ని బుధవారం ప్రారంభించి మాట్లాడారు. 108 అంబులెన్స్‌ను కోహెడకు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మండలం నుంచి 15 కిలోమీటర్ల దూరం వరకు 108 సేవలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొక్కుల కీర్తి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి, సర్పంచ్ పెరియాల నవ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల సందర్శన



రంగనాయక స్వామి ఆలయంలో డాక్టర్ రామనాథం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని పురాతన దేవాలయాలను బుధవారం టీటీడీ ఉద్యోగి డాక్టర్ రామనాథం సందర్శించారు. చంద్లాపూర్‌లోని రంగనాయక స్వామి, విఠలాపూర్ గ్రామంలోని విఠలేశ్వరాలయం, చిన్నకోడూరులోని వేణుగోపాల స్వామి దేవాలయం, సలేంద్రిలోని రామలింగేశ్వర దేవాలయాన్ని సందర్శించి దేవాలయాల చరిత్ర తెలుసుకున్నారు.

బీటీ రోడ్డు పనుల పరిశీలన

బెజ్జంకి(సిద్దిపేట): అభివృద్ధే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. బెజ్జంకి మండల కేంద్రం నుంచి బేగంపేట గ్రామం వరకు రూ.9 కోట్లతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణాన్ని బుధవారం పరిశీలించారు. బీఆర్ఎస్ తోనే అభివృద్ధి సాధ్యమని, గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి ఇప్పుడు జరుగుతోందన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 20వ వార్డులో బస్టాండ్ నిర్మాణ పనులు, 5వ వార్డులో జంక్షన్ అభివృద్ధి పనులను మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు.

అధికారంలోకి రాగానే పేదలకు ఇళ్లు

కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): నిరుపేదలకు ఇళ్లు కట్టించి ఇస్తామని, ఈ ప్రక్రియ కాంగ్రెస్ అధికారంలో రాగానే ప్రారంభిస్తామని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కపూర్ నాయక్ తండా, నందారం గ్రామాల్లో పల్లెపల్లెకు ప్రవీణ్ అన్న, గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పేద, మధ్య తరగతి వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమన్నారు.

హుస్నాబాద్‌రూరల్: రానున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు ఇందిరమ్మ పథకం కింద ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఆర్థిక సహాయం చేస్తామని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. బుధవారం పందిల్లలో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు.

వర్షబాధితులకు సాయం చేయండి



వినతిపత్రం అందజేస్తున్న డీబీఎఫ్ నాయకులు

గజ్వేల్‌రూరల్: వర్షబాధితులను ఆదుకోవాలని డీబీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయ ఏఓ రహెమాన్‌కు డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని కొండపాక, కుకునూర్‌పల్లి, జగదేవ్‌పూర్, ములుగు, మర్కూక్, తూప్రాన్ మండలాల్లో వర్షాల కారణంగా పలువురి ఇళ్లు కూలిపోయాయన్నారు. అధికారులు సర్వే చేపట్టి నష్టపోయిన వారికి పరిహారం అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఇళ్లు కూలిపోయిన వారికి గృహలక్ష్మీ పథకం కింద కొత్త ఇళ్లు మంజూరుకు ఆర్థిక సాయం అందజేయాలని కోరుతున్నామన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కోహెడ(హుస్నాబాద్): మండలంలోని 21 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యం చేయించుకునేందుకు పేదప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపన్నహస్తంగా నిలుస్తుందన్నారు. 21 మందికి రూ.4.84 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కీర్తి, సురేష్, సర్పంచ్ నవ్య పాల్గొన్నారు.

తొగుట(దుబ్బాక): మండలంలోని లింగంపేట, ఘనపురం గ్రామాల్లో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. లింగంపేటలో శంకరయ్యకు రూ 18 వేలు, ఘనపురంలో దొంతరమైన మల్లవ్వకు రూ.60 వేలు, అక్కం రేఖకు రూ.24వేలు, పోచాగౌడ్‌కు రూ.14 వేలు, చంద్రవ్వకు రూ.16 వేలు ప్రభుత్వం విడుదల చేసింది.

కోహెడరూరల్(హుస్నాబాద్): నిరుపేదలను సీఎం రిలీఫ్ ఫండ్ వైద్యం చేయించుకునేందుకు ఆదుకుంటుందని బీఆర్ఎస్ మండల నాయకుడు అన్నాడి రాజిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రామచంద్రపూర్ గ్రామానికి చెందిన సంపంగి ఎల్లవ్వకు మంజూరైన రూ.18 వేల చెక్కును అందజేశారు.

డంప్‌యార్డుగా 'ఎల్లమ్మ చెరువు మత్తడి'

హుస్నాబాద్: పట్టణంలోని కాకతీయుల నాటి ఎల్లమ్మ చెరువు మత్తడి డంప్‌యార్డుగా మారిందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు అన్నారు. బుధవారం పార్టీ నాయకులతో కలిసి మత్తడిన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో ఎల్లమ్మ చెరువు మత్తడిలో చెత్తను పారబోస్తున్నారన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మత్తడి దిగువ ఉన్న వాగులు, చెక్ డ్యామ్‌లోని నీరు కలుషితమయ్యాయని, అంతేకాకుండా చెత్త నిల్వతో దుర్వాసన వెదజల్లుతోందన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి మత్తడి పరిసరాలను శుభ్రం చేయించాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

తండాలోనే జీపీ భవనం

అక్కన్నపేట(హుస్నాబాద్): నూతన పంచాయతీ భవనాన్ని దూరంగా నిర్మించాలనే ప్రయత్నాలు చేస్తున్నారని, స్థానికంగా నిర్మించాలని మండలంలోని కేశనాయక్‌తండా గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డికి గ్రామ ఉపసర్పంచ్ లావుడ్యి భాస్కర్‌నాయక్ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ మాట్లాడుతూ రైతు లావుడ్యి రవి గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి 10 గుంటల భూమి విరాళంగా ఇచ్చారన్నారు. దాత ఇచ్చిన భూమి పత్రాలను అధికారులకు సమర్పించామన్నారు. అధికారులు స్పందించి ప్రజాదర్బార్‌ను గ్రామంలో ఏర్పాటు చేసి సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఎస్ఐకి సన్మానం**

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన సుభాశ్ గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు బంక చిరంజీవి ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు శాంతియుత వాతావరణంలో జీవించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎల్లయ్య, దిలీప్ కుమార్, అజ్జు యాదవ్ తదితరులు ఉన్నారు.

◆ **దుర్గమ్మ ఆలయానికి విరాళం**

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని పీర్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న దుర్గమ్మ ఆలయానికి డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి బుధవారం గ్రామ సర్పంచ్ యాదవరెడ్డికి రూ.51 వేల విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనతో గ్రామీణ ఆలయాలకు పూర్వ వైభవం వస్తోందన్నారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రంగారెడ్డి, ములుగు ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు లింగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

◆ **సర్కార్ బడుల్లో నాణ్యమైన విద్య**

మర్కూక్(గజ్వేల్): సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని కృషి ఫౌండేషన్ చైర్మన్ అమరసింహ అన్నారు. బుధవారం మండలంలోని ఎర్రవల్లి, యూసుఫ్‌ఖాన్‌పల్లి, గంగాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాల్‌రాజు, సర్పంచ్ ప్రసాద్, ఉపసర్పంచ్ మల్లేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **పాతపద్ధతిలోనే కొనసాగించాలి**

రాయపోలు(దుబ్బాక): వీఆర్ఏలను పాతపద్ధతిలోనే కొనసాగించాలని, వాటాబంధి విధానంలోనే విడతలుగా విధులు పంచుకునేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం దౌల్తాబాద్ మండలంలోని వీఆర్ఏలు దౌల్తాబాద్ రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు సత్తయ్య, ఉపాధ్యక్షుడు స్వామి, నాయకులు పాల్గొన్నారు.

◆ **ఆర్టీసీ విలీనంపై హర్షం**

ములుగు(గజ్వేల్): ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని కేబినెట్‌లో సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం హర్షనీయమని ములుగు పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుక్కల నరేశ్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఆర్టీసీ కార్మికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సీఎం కేసీఆర్ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయడం అభినందనీయమన్నారు. సంక్షేమమే లక్ష్యంగా కేసీఆర్ పాలన సాగుతోందన్నారు.

◆ **పెండింగ్ బిల్లులు చెల్లించాలి**

చేర్యాల(సిద్దిపేట): జీపీఎఫ్‌లో పెండింగ్ ఉన్న బిల్లులను వెంటనే మంజూరు చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమాండ్ల రాంరెడ్డి డిమాండ్ చేశాడు. బుధవారం చేర్యాలలో ఆయన మాట్లాడుతూ జీపీఎఫ్ పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ ఆగస్టు 5వ తేదీన జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

◆ **ఎంసెట్ కౌన్సెలింగ్‌కు వందమంది**

నంగునూరు(సిద్దిపేట): రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న రెండో విడత ఎంసెట్ ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు బుధవారం వంద మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ సూర్యనారాయణ తెలిపారు. సీటు పొందిన విద్యార్థులు కళాశాలకు ఆప్షన్లు పెట్టుకోవాలన్నారు.

◆ **బహుజనుల అభివృద్ధే దేశాభివృద్ధి**

గజ్వేల్‌రూరల్: బహుజనులు అభివృద్ధి చెందినపుడే దేశం అభివృద్ధి సాధిస్తుందని బీఎస్పీ నాయకులు పేర్కొన్నారు. బహుజనులను చైతన్యవంతులను చేసేందుకు బుధవారం మండల పరిధిలోని పిడిచెడ్, అహ్మదీపూర్, సింగాటం, బూర్గుపల్లి, దాచారం గ్రామాల మీదుగా గజ్వేల్ వరకు బహుజన చైతన్యయాత్రను నిర్వహించారు.

◆ **జిహాదీల దిష్టిబొమ్మ దహనం**

సిద్దిపేట కమాన్: హర్యానాలో మేవాత్ యాత్ర భక్తులపై జిహాదీలు జరిపిన రాళ్లదాడిలో ఇద్దరు హోంగార్డులు మృతి చెందడంతో పాటు మరికొంతమంది గాయపడటం బాధాకరమని విశ్వహిందూ పరిషత్ జిల్లా కన్వీనర్ రాజారాం అన్నారు. రాళ్ల దాడిని నిరసిస్తూ సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్ చౌరస్తాలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బుధవారం జిహాదీల దిష్టిబొమ్మ దహనం చేశారు. దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

◆ **గణిత సామర్థ్యాల సాధనపై శిక్షణ**

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు ప్రాథమిక స్థాయి మౌలిక భాష గణిత సాధనకై రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో నర్సింహారెడ్డి బుధవారం తెలిపారు. ఉపాధ్యాయులకు ఈనెల 2వ తేదీ నుంచి 8 తేదీ వరకు తెలుగు, గణితం, ఇంగ్లీష్ సబ్జెక్ట్‌లపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.